
# రత్నం

## డాక్టర్ సూర్యదేవర అచ్చయ్య




ఆ రోజు ఆదివారం.

నారాయణరావు ఇంట్లో ఒంటరిగా వున్నాడు. భార్య రెండు రోజులు అమ్మాయి దగ్గర వుండి వస్తానని వెళ్ళింది. పెద్దవాడు బిజినెస్ పనులు చూసుకొస్తానని కోడల్ని తీసుకుని మద్రాసుకు వెళ్ళాడు. చిన్నవాడు మైసూరులో చదువుకుంటున్నాడు.

బద్ధకంగా ఉండటాన ఆలస్యంగా లేచాడు. తన కార్యక్రమాలు పూర్తి చేసుకుని వంట మనిషి నర్సమ్మ ఇచ్చిన కాఫీ తగి న్యూస్ పేపర్ తిరగేస్తూ సోఫాలో కూర్చున్నాడు. ఒక్కోసారి పేపర్ చూడాలంటే ఆయనకు భయం వేస్తుంది, బ్లడ్ ప్రెషర్ పెరుగుతుందేమోనని, ఈ మధ్య పేపర్ నిండా ఉద్రేకం కలిగించే వార్తలే ఎక్కువగా వుంటున్నాయి.

స్థిరంగా కూర్చోలేక రోడ్డు వేపు వున్న కిటికీ తెరిచాడు. ఋతు పవనాలు చురుగ్గా వున్న రోజులు కావడాన ఆకాశం నిండా నల్లని మేఘాలు కమ్ముకొని వున్నాయి. చలిగాలి వీస్తోంది. సన్నగా చినుకులు మొదలై పెద్ద వర్షంగా మారింది. కొద్దిసేపట్లోనే రోడ్డంతా జలమయమయింది. ఆ నీటి మీద పడే చినుకుల తాకిడికి అసంఖ్యాకంగా బుడగలు లేచి పగిలిపోతున్నాయి. ఆ దృశ్యం చూస్తున్న కొద్దీ సిస్టర్ రత్నం అన్నమాటలే జ్ఞాపకం వస్తున్నాయి నారాయణరావుకు. అప్రయత్నంగా గుండె మీద చెయ్యి పెట్టుకొని గాఢంగా నిట్టూర్చాడు. అక్కడ వుండలేక కిటికీ మూసి వచ్చి కూర్చున్నాడు.

ఒకరోజు నారాయణరావుకు సడన్‌గా గుండె పోటు వచ్చింది. హాస్పటల్‌లో చేర్చారు. అదృష్టం బాగుండి ప్రమాదం జరగలేదు. రక్తంలో కుదప యేర్పడి కొరొనరీ ఆర్టెరీకి అడ్డుపడింది. బ్లాస్ట్ చేస్తే క్లియర్ అయింది. ఆ రోజు నుండి ఎన్నో రకాల నిర్బంధాలు మొదలయ్యాయి. తగిన వ్యాయామం చెయ్యాలి. షుగర్ వాడకూడదు. మితంగా భోంచెయ్యాలి. నవ్వు వస్తుంది ఆయనకు– అమితంగా సంపాదించి మితంగా భోం చెయ్యాల్సి వచ్చినందుకు.

ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో వున్నప్పుడు సిస్టర్ రత్నం తనకు ఎంతో సేవ చేసింది. తల్లీ, భార్య కూడా అంత శ్రద్ధ చూపలేరేమోననిపించింది. నైట్ డ్యూటీలో వుండి ఒక్క క్షణం కూడా ఏమరుపాటు చూపలేను. మొదటి రోజు తను పడ్డ బాధకు జీవిస్తాడనే నమ్మకం పోయింది. డాక్టర్లు చేసిన వైద్యం కంటే ఆమె తన పట్ల చూపిన శ్రద్ధ తనకు జీవం పోసినట్లనిపించింది. రాత్రంతా జాగారం చేసి ప్రొద్దున్నే "విష్ యూ గుడ్ డే అన్నగారూ". అని వెళ్ళుతుంటే ఆమె పట్ల మనసు నిండా కృతజ్ఞతా భావం నిండిపోయేది.

వార్డులోకి షిఫ్ట్ అయాక కూడ ఆమె "ఎలా వున్నారు అన్నగారూ?" అని పలకరించిపోయేది.

26-2-93 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక



# సినారె ఛలోక్తులు



1957లో అవి నేను బి.ఎస్సీ. చదువుతున్న రోజులు. ఉస్మానియా యూనివర్సిటీ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంటులో ఓ మీటింగ్ జరుగుతోంది. ఆ సభలో అప్పటి వైస్ ఛాన్సలర్ డాక్టర్ సూరి భగవంతంగారు అధ్యక్ష పీఠంలో వున్నారు. వక్తగా మాట్లాడవలసి వున్న ఆనాటి తెలుగు లెక్చరర్ డాక్టర్. సి.నారాయణరెడ్డిగారు లేచినిలబడి మెల్లగా మైకుదగ్గరికి వచ్చారు. వేదిక మర్యాదలన్నీ పాటించిన తర్వాత సినారె "నాకు భగవంతంగారిని చూస్తే భయవంతంగా వుంది" అన్నారు. అంతే హాలంతా నవ్వులతో నిండిపోయింది. భగవంతంగారు కూడా ఎడమచెయ్యి నోటికి అడ్డం పెట్టుకొని ముసిముసి నవ్వులు నవ్వడం నాకిప్పటికీ గుర్తు.

— కుసుమ. కె.మూర్తి, హైదరాబాద్

◆ సేకరణ: డాక్టర్ ఎన్.గోపి

క్రమేణా ఆమెతో తనకు చనువు యేర్పడి ఆత్మీయత పెరిగింది.

తను బాగా కోలుకున్నాడు.

ఒక రోజు రత్నం తాపీగా వచ్చి తనకు ఎదురుగా స్టూల్ మీద కూర్చొని "ఒకటి రెండు రోజుల్లో మీ[illegible] డిస్‌ఛార్జి అయి వెళ్ళిపోతారు అన్నగారూ!" అంది.

తనకు ఆమెను గురించిన వివరాలు తెలుసుకోవాలనిపించి "మీరు ఎక్కడ వుంటారు సిస్టర్?" అని అడిగాడు.

"క్వార్టర్స్‌లో"

"మీతో ఇంకా ఎవరుంటారు సిస్టర్?"

ప్రశాంతంగా వున్న ఆమె ముఖం వివర్ణమయింది. ఆమె చల్లని చూపులకు నీటి పొరలు అడ్డం వచ్చాయి. ఒక చేతిలోకి జోడు తీసుకుని మరో చేతిలోకి కర్చీఫ్ తీసుకుని కళ్ళు అద్దుకుంది.

"మిమ్మల్ని అనవసరంగా ఇబ్బంది పెట్టినట్లున్నాను సిస్టర్!"

"ఫరవాలేదు అన్నగారూ! నేనిప్పుడు ప్రపంచంలో ఒంటరిదాన్ని. అమ్మా, నాన్నా ఊహ తెలియకముందే పోయారు. మా తాతగారు నన్ను పెంచారు. నర్స్ ట్రైనింగ్ అయి ఉద్యోగంలో చేరాక నాకు వివాహం అయింది. జీవితానికి చుక్కాని దొరికింది అనుకున్నాను. రక్షణ యిస్తాడనుకున్న భర్త తాగుడుకు బానిసై రెండు సంవత్సరాలలోనే నరకం ఎట్లా వుంటుందో చూపించాడు. ఒక రోజు తప్ప తాగి రోడ్డు యాక్సిడెంట్‌లో చనిపోయాడు. అప్పటి నుండీ హాస్పటలే నా ప్రపంచం. ఇక్కడకు వచ్చే రోగులే నా బంధువులు. బ్రతికి వుండగానే ఓ మంచి పని చేశాననే ఆత్మతృప్తి కోసం ఈ మధ్యనే నేత్ర నిధికి నా కళ్ళు దానం చేస్తున్నట్టు వ్రాసి ఇచ్చాను" అని చెప్పి గాఢంగా నిట్టూర్చింది.

ఆవేదనతో, ఆశ్చర్యంతో ఆమె చెప్పే విషయాలు వింటూ ఆమె ముఖంలోకి చూస్తూ వుండిపోయాడు తను. తరువాత తెప్పరిల్లి జీవితమనే అగ్నిగుండంలో సమిధల్లా దహించుకుపోతున్నా ఎదుటి వారి క్షేమాన్నే కోరుకుంటారు కొందరు త్యాగమూర్తులు అనుకున్నాడు.

"మీతో మాట్లతాడుతూ వుంటే నాకూ అప్పులున్నారు అనిపిస్తుంది అన్నగారూ!" అంటూనే ఏదో జ్ఞాపకం వచ్చినట్లయి వెళ్ళిపోయింది.

ఆత్మీయత కోసం ఆమె ఎంత తపించిపోతుందో బోధపడింది. ఆమె దీన గాధ విన్నాక ఆమె పట్ల తనకు ఎనలేని సానుభూతి కలిగింది. ఆమె నిస్వార్థ సేవలు తనను ఎంతగానో ఆకర్షించాయి. కేవలం ధనార్జనా తాపత్రయంతో గమనం సాగిస్తూ మనిషి జీవితంలో ఎన్నో విలువైన విషయాలను మర్చిపోతున్నాడు అనిపించింది.

బలవంతం చేస్తే అప్పడప్పుడు తమ ఇంటికి వస్తూ తమతో కలిసి పోయింది.

ఒక్కోసారి వేదాంతిలా అంటూ వుంటుంది "ఈ జీవితాలు ఎంతవరకు శాశ్వతం అన్నగారూ! నీటి బుడగల్లా ఎప్పుడో పగిలిపోతాయి. మనిషి బ్రతికి వుండగానే జీవితాన్ని సార్థకం చేసుకోవాలి"

మంచి వాళ్ళ జీవితాలు ఎదుటి వాళ్ళను ఎంతగా ప్రభావితం చేస్తాయో అర్థమయింది తనకు. ఇప్పుడు తన జీవితాన్ని రత్నం జీవితంతో పోల్చుకొని విశ్లేషణ చేసుకుంటున్నాడు.

నా అన్న వాళ్ళు లేకపోయినా రోగులకు సేవ చేయడమే పరమావధిగా ఆమె జీవిస్తోంది. తన నేత్రాలను దానం చేసి మరణించిన తరువాత కూడా జీవించబోతోంది. తను కేవలం ధనార్జనే ధ్యేయంగా అర్థం లేని తాపత్రయంతో ఇంతకాలం జీవించాడు. ఆమె జీవిత గాధ తనను ఎంతో ప్రభావితం చేసి తనకు కనువిప్పు కలిగించింది. మనిషి కేవలం తన కోసమే జీవించకూడదు. తనకు జన్మనిచ్చి పోషించిన సమాజానికి కూడా ఉపయోగపడాలి.

"వంటయిందయ్యా! స్నానం చేసి భోజనానికి రండి" అన్న నర్సమ్మ మాటలకు ఈ లోకంలోకి వచ్చి గడియారం చూసుకుంటే పన్నెండయింది.

సోఫాలోంచి లేచి బాత్‌రూంకేసి నడిచాడు స్నానం చెయ్యడానికి.

భోజనం చేసి మంచం మీద నడుం వాల్చాడు. ఒంటరి జీవితం ఎంత దుర్భరంగా వుంటుందో ఈ రెండు రోజుల అనుభవంతోనే తెలిసి వచ్చింది. సాయంత్రం కాసేపు రత్నం క్వార్టర్ కేసి వెళ్ళి వద్దామనుకున్నాడు. అంతలోనే కన్ను మలిగింది.

*****

పున్నమి చంద్రుడు ఆకాశంపైకి ఎగబ్రాకుతు

న్నాడు. చల్లని వెన్నెల మనసుకు హాయినిస్తోంది. నిర్జన ప్రదేశంలో ఏటి వొడ్డున ప్రకృతి శోభకు పరవశించిపోతూ సన్నగా మెలికలు తిరుగుతూ సాగిపోతున్న నీటి జాలు కేసి తదేకంగా చూస్తూ కూర్చుని వున్నాడు నారాయణరావు. దూరాన ఆకాశంలో సన్నగా కాంతిరేఖలు పొడ చూపి క్రమంగా మిరుమిట్లు గొలిపే వెలుగు రూపం చెంది తనకేసి వస్తూ వుండడం గమనించి విస్తుపోయాడు. క్షణికకాలంలో దివ్య తేజస్సుతో వెలిగిపోతున్న పూలరథం తన ముందు వచ్చి ఆగింది. అందులో నుండి తెల్లని దుస్తుల్లో, ముఖంలో ఆనందజ్యోతులు వెలుగుతుండగా రత్నం తనకేసి చూస్తూ "శలవు అన్నగారూ!" అంది చెయ్యి వూపుతూ.

దిగ్గున మెలకువ వచ్చింది నారాయణరావుకు. ఏమిటీ విపరీతం! ఎప్పుడూ ఇటువంటి కల కన లేదు. పగటి కలలు నిజమౌతాయా! రత్నంకు ఏమయినా అయిందా! అన్న ఆలోచనలు చికాకు పరిచాయి.

అమాంతం మంచం మీద నుండి లేచి గ్లాసెడు చల్లని నీళ్ళు గటగటా తాగాడు. చమటతో వొళ్ళంతా తడిచిపోయింది. ఫ్యాన్ వేసుకున్నాడు. మనసుకు కాస్త హాయి అనిపించింది.

అప్పుడు సమయం నాలుగయింది. రత్నంను చూడాలన్న ఆలోచన తరుముతూ వుంటే ముఖం కడుక్కొని బట్టలు వేసుకున్నాడు. నర్సమ్మ ఇచ్చిన కాఫీ తాగి కారు స్టార్ట్ చేసుకొని బయలుదేరాడు.

యాంత్రికంగా కారు నడుపుతున్నాడే గాని మనసంతా ఆవేదనతో నిండిపోయింది. ఆలోచనలు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. రత్నం ఇంటి ముందుకు వచ్చాక అక్కడ జనం చేరి వుండడం చూసి మనసు కీడును శంకించింది. కారు ఆపి దిగేరికి అక్కడ వున్న వాళ్ళు అతని చుట్టూ మూగారు. పరిస్థితి అర్థమయింది.

"ఈ రోజు ఆదివారం అయినా ఎమర్జన్సీ డ్యూటీ వుండటాన రత్నం హాస్పటలుకు వెళ్ళింది. లోనికి వెళ్ళుతూనే గుండెపోటు వచ్చిపడిపోయింది. డాక్టరు వచ్చి చూసేలోగానే ప్రాణం పోయింది" అని చెప్పాడు ఒకతను.

క్షణం సేపు చైతన్యం కోల్పోయాడు నారాయణరావు. తరువాత తమాయించుకొని గాఢంగా నిట్టూర్చాడు. నీటి పొరలు అడ్డం వస్తే జోడు తీసి కళ్ళు తుడుచుకొని ఆమె భౌతిక కాయం వుంచబడిన ముందు గదిలోకి వెళ్ళాడు. తన అమూల్యమైన సేవల్తో ఎందరికో ఊరట కలిగించిన సిస్టర్ రత్నం చైతన్యం లేకుండా పడి వుంది. ఐ బ్యాంక్ డాక్టర్లు ఆమె నేత్రాలు పెకిలించి లొత్తలు కనపడకుండా పట్టీలు వేశారు.

"ఈ జీవితాలు ఎంతవరకు శాశ్వతం అన్నగారూ! నీటి బుడగల్లా ఎప్పుడో పగిలిపోతాయి. మనిషి బ్రతికి వుండగానే జీవితాన్ని సార్థకం చేసుకోవాలి" అన్న ఆమె మాటలు చెవుల్లో గింగురుమంటుంటే ఇంకోసారి కళ్ళు తుడుచుకున్నాడు నారాయణరావు బరువెక్కిన గుండెతో.

ప్రశాంతంగా నిద్రపోతున్నట్లున్న ఆమె ముఖంలోకి చూస్తుంటే "నేనిప్పుడు ప్రపంచంలో ఒంటరిదాన్ని అన్నగారూ!" అని ఒకప్పుడు ఆమె అన్న మాటలు తలపుకు వచ్చాయి.

"లేదమ్మా! నీవు ఒంటరిదానివి కాదు. నీ అన్నగా తరువాత జరగాల్సిన కార్యక్రమాలు నా చేతుల మీదుగా జరిపిస్తాను" అనుకుంటూ బయటకు వచ్చాడు.

*****

ఋతు పవనాల బలం తగ్గి మబ్బులు విచ్చుకపోయాక మిలమిల మెరిసే సూర్యకాంతి నలుదిశల వ్యాపించడంతో లోకం కొత్త ఊపిరి పీల్చుకుంది.

నాలుగు రోజులుగా మౌన గాంభీర్యం నిండుకొని వున్న నారాయణరావు ఇంట్లో మమూలు సందడి మొదలయింది.

కాఫీ తాగి పెద్దబ్బాయి సుధాకర్ మద్రాసు విశేషాలు చెప్తుంటే వింటూ కూర్చున్నాడు నారాయణరావు. బయట కాలింగ్‌బెల్ నొక్కిన చప్పుడయి లేచి వెళ్ళి తనే స్వయంగా తలుపు తీశాడు. నలుగురు సిస్టర్స్ బయట నిల్చొని వున్నారు. నారాయణరావును చూడగానే వాళ్ళు నలుగురూ ఒక్కసారిగా "గుడ్‌మార్నింగ్ సర్!" అన్నారు.

వాళ్ళను లోపలికి ఆహ్వానించి కూర్చోమన్నాడు నారాయణరావు. కొద్ది మౌనం తరువాత వాళ్ళలో పెద్ద సిస్టర్ "ఆపదల్లో వున్న సిస్టర్స్‌ను ఆదుకునే ఉద్దేశ్యంతో కొంత నిధిని సమకూర్చే ప్రయత్నంలో మీలాంటి పెద్దల దర్శనం చేసుకుంటున్నామండీ!" అంది.

ఆమె చెప్తున్నది వింటున్న నారాయణరావు కళ్ళ ముందు లొత్తలు కనపడకుండా పట్టీలు వేసిన కళ్ళతో నిర్జీవంగా పడివుఉన్న సిస్టర్ రత్నం ఆకారం మెదిలింది.

మాట్లాడకుండా లోపలకు వెళ్ళి చెక్కు బుక్ తీసుకొచ్చి లక్ష రూపాయలకు చెక్కు రాసి ఇచ్చాడు.

ఆ చెక్కు అందుకున్న సిస్టర్ కాసేపు తను కలగనటం లేదు గదా! అన్న భ్రాంతిలో వుండిపోయింది. అంతలోనే తేరుకొని "మీకు కృతజ్ఞతలు ఎలా చెప్పాలో తెలియటం లేదు అన్నగారూ!" అంది వొణుకుతున్న స్వరంతో.

అటువంటి సన్నివేశాన్ని అంతకు ముందెన్నడూ చూడని సుధాకర్ ఆశ్చర్యంతో తండ్రి ముఖంలోకి చూస్తూ వుండిపోయాడు.

తృప్తిగా గాలి పీల్చుకున్నాడు నారాయణరావు.

◆


త్వరలో... ఆంధ్రజ్యోతి – ఎమెస్కో వారి నవలల పోటీలలో బహుమతి పొందిన నవల

